మనసులోనున్న భావంబు మంచిదైన
కలిగి తీరును ఫలసిద్ధి కార్యమందు
మనసులో నున్న భావంబు మలినమైన
ఫలము కూడను ఆరీతి మలినమగును.

విద్యార్థులారా!

భారతీయ సంస్కృతి అనుపమానమైనది. అత్యున్నతమైనది. మనిషి అంటే మనసే. మనసంటే సంకల్పముల చేరికయే. సంకల్పముల ప్రభావమే నడతలు. నడతల యొక్క ఫలితమే సుఖదుఃఖములు. ఈనాటి మానవుడు అనుభవించే సుఖదుఃఖములకు మూలకారణము అతని యొక్క నడవడియే. ఈ నడవడికి మూల కారణము సంకల్పములే. ఈ సంకల్పముల చేరికే మనసు.. మనసు నుంచి వచ్చిన వాడు కనుక ఇతనికి మనిషి అని పేరు. మనసే లేక మనిషి కాడు. మనసు కలవాడే మనిషి. పశు పక్షి మృగాదులకు మనస్సు లేదు.

ఈ మనసు ద్వారా వాక్కు ఆవిర్భవిస్తున్నది. ఈ మనస్సు అహం తత్వము నుండే ఆవిర్భవించింది. అహము ఆత్మ యొక్క ప్రతిబింబమే. వాక్కు, మనస్సు, అహం, ఆత్మ ఈ నాలుగు ఒకే కుటుంబమునకు చెందినవి. ఇందులో వాక్కు, మనసు, అహం మూడు చేరినప్పుడే మానవత్వం దివ్యత్వముగా రూపొందుతుంది. ఈ మూడు కూడ అన్యోన్య అనురాగ బాంధవ్యముతో కూడినప్పుడే మానవత్వము దివ్యత్వము పొందుతుంది. ఈ మూడింటి ఏకత్వమునకు భిన్నము జరిగినప్పుడు అనేక విధములైన అశాంతికి గురౌతుంది. ఒక ఇంట్లో ముగ్గురు సోదరులుంటారు. ఈ ముగ్గురు ఒకరినొకరు అనుసరించి ప్రేమించి ఒకరినొకరు అన్యోన్యముగా కలసి ఉండినప్పుడే ఇంటిలో శాంతి ఏర్పడుతుంది. కాని ఏ కారణము చేతనైనా మనస్సునందు అభిప్రాయ భేదములు ఆవిర్భవించినప్పుడు ఒకరినొకరు ద్వేషించి భిన్నముగా ప్రవర్తించినప్పుడు ఆ అశాంతి ఇల్లంలో పాకిపోతుంది. ఐకమత్యమే ఆనందమునకు శాంతికి మూలకారణము. ఐకమత్యము చెడినప్పుడే అసంతృప్తికి అశాంతికి ఒక విధమైన కారణము ఏర్పడుతుంది.

ఇక్కడ ఇల్లు ఏది? ముగ్గురు అన్నదమ్ములు ఎవరు? దేహమనేది ఒక ఇల్లు. ఒక దేవాలయము. ఈ గృహమనే దేహమందు ముగ్గురు అన్నదమ్ములున్నారు. Thoughts, words, actions. సంకల్పములు, వాక్కు, క్రియాశక్తి. ఈ ముగ్గురు అన్యోన్యముగా ఐకమత్యముగా ఆనందముగా కలిసిమెలిసి ఉండినప్పుడే ఏ కార్యమునైనా విజయము సాధించవచ్చు. కాని సంకల్పములు ఒక వైపున, పలుకులు మరొకవైపున, పని ఇంకొకవైపున పోయినప్పుడు ఒకదానికొకటి ఐకమత్యము చెదరినప్పుడు ఏ కార్యము మనము సాధించలేము. ఈ మూడింటి ఏకత్వమునకే త్రికరణశుద్ధి అన్నారు. మన గృహమందు ఈ మూడింటి ఐకమత్యమునకు తగిన ఉత్సాహ ప్రోత్సాహములను పురికొల్పాలి.

నిర్దయుడై, క్రూరుడై, కఠినుడై అనేక క్రూర కార్యములు రత్నాకరుడు తన పొట్ట కూటి నిమిత్తమై, కుటుంబపోషణ నిమిత్తమై, చేస్తూవచ్చాడు. తన సంకల్పములన్నీ క్రూరమైన సంకల్పములుగా రూపొందినాయి. నిర్దయ స్వరూపము ధరించింది. కారుణ్యా శూన్యమై కాఠిన్యము అభివృద్ధి అయింది. కనుక దారులు కొట్టే దొంగగా తయారయ్యాడు రత్నాకరుడు. వీరు వారు అనే భేదము లేక అందరిని చంపటము, వారి ధనము అపహరించటము. ఈ విధమైన మార్గములో ప్రవేశించాడు. ఎంతకాలము నుండియో దుర్గుణములను, దురాలోచనలను, దుస్సంకల్పములను అభివృద్ధి గావించుకున్న ఈ రత్నాకరుడు ఒకమారి సప్తఋషులను దర్శించటంచేత పాప నాశనమైంది. వారిని అడ్డగించి వీరిని చంపుటకు ప్రయత్నించాడు. ఈ రత్నాకరుడు. 'నాయనా చంపటము మంచిది కాదు. క్రిమికీటకాదులు మానవునికి కీడు చేస్తుంటాయి. మేలు చేసేవాడే మనిషి. మేలు చేయటానికి ప్రయత్నించు. కీడు చేయటానికి ముందంజ వేయకు. ఎందుకోసం ఈ పని చేస్తున్నావు:

జానెడు పొట్ట నింపుకొన చిక్కుల నొందుచు కోటి విద్యలన్
పూనిక మీర నేర్చి పరిపూర్ణ సుఖంబును పొందలేక యీ
మానవ జాతి దుఃఖముల మగ్గగ నేటికిన్ శ్రీపరాత్పరున్
ధ్యానము చేయు భక్తులకు దారిని చూపక యుంటి మానవా!

పిచ్చివాడా! ఈ చిన్న పొట్ట నిమిత్తమై కోటి మందిని బాధపెట్టి నీ పొట్ట నింపుకొని నీవు అనుభవించే సుఖము ఏమిటి? నీ కుటుంబము ఏ సుఖము అనుభవిస్తున్నాది. ఇట్టి పాప కృత్యములు

తలంపకు. నీవు నేటి నుండి శరీరము ధరించిన వ్యక్తి కనుక కర్తవ్యము లాచరించి కరచరణాది అవయవములతో కర్మలాచరించి భజించి భుజించుము అని సప్తఋషులు అతనికి బోధించగా సందర్శనము చేత, సంభాషణ చేత అతని సంకల్పములు మార్పు చెందినాయి. కనుక సత్సంగము మానవునికి ప్రధాన లక్ష్యము. సత్సంగము చేతనే ఏకాగ్రతను పోషించుకోవచ్చు. సత్సంగము చేత మనలోని దుర్భావములను నిర్మూలము గావించుకోవచ్చు. చెడ్డసంకల్పముల నిర్మూలమే మోక్షమునకు మూలకారణము.

సత్సంకల్పే నిస్సంకల్పత్వం
నిస్సంకల్పత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చలతత్వే జీవన్ముక్తిః.

సత్సంకల్పములు ప్రతి మానవుడు ప్రయత్నపూర్వకముగా సాధించటానికి ప్రయత్నించాలి. ఆనాటి నుండి సప్తఋషుల ప్రబోధల చేత ప్రోత్సాహము చేత ఉత్సాహము అభివృద్ధియై రామనామము చింతిస్తూ కూర్చున్నాడు. రామనామము చేతనే తన జీవితము ధన్యమై పోయింది. లోకనాథుడు భగవంతుడైనప్పుడు శ్లోకదాత వాల్మీకి అయ్యాడు. శ్లోకనాథుడు లేక లోకనాథుని ప్రచార ప్రభోధలు జగత్తును వ్యాపించి ఉండేవి కాదు. వాల్మీకి లోకమునకు ఆదర్శము నిరూపించాడు.

ప్రతి మానవుడు ఆదర్శపురుషుడు కావాలి. మానవత్వములో ఉండిన ఘనత ఎంతో గొప్పదిగా ఉంటున్నది. మానవుని యందు లేని శక్తి మరొక దాని యందు కనిపించదు. సర్వశక్తులు మానవుని యందు ఇమిడి ఉంటున్నవి. అయితే సక్రమైన రీతిగా సంస్కరింప చేసుకోవాలి. దోషములు నిర్మూలము గావించి గుణములు పోషించుకున్నప్పుడు, పోషించుకున్న గుణములు ఆచరణలో పెట్టినప్పుడు ఆనందమునకు సరైన అలవాలమై పోతుంది. ప్రతి మానవుడు దోషరహితుడు కావాలి. గుణపోషకుడు కావాలి. అప్పుడే మానవుని యందు దుఃఖనివృత్తి ఆనందప్రాప్తి చేకూరుతుంది. నిజముగా నమ్మి పూజించి విశ్వసించి పనిలో పాల్గొన్న వ్యక్తి ఏనాటికి చెడడు.

నమ్మక చెడినవారలున్నారుగాని
నమ్మిచెడినవారు ఈ లోకాన లేరు.

ఈనాటి మానవుడు నమ్మకమనే నేత్రములు కోల్పోయినాడు. నమ్మరాని వాటి నన్నింటిని నమ్ముతున్నాడు.

నమ్మతగినవి నమ్మటం లేదు. అందరిని నమ్మేవాడు మానవుడు. దైవమును నమ్మడు. ఈనాడు ఏకాదశి అంటున్నావు క్యాలెండరులో. ఈ క్యాలెండరు ఒక సిద్ధాంతి వ్రాసినది. ఎవరో ఒక సిద్ధాంతి వ్రాసిన పంచాంగమును ఆధారము చేసుకొని ఈనాడు ఏకాదశియని విశ్వసించి ఏకాదశి వ్రతము ఆచరిస్తున్నావు. ఈనాడు Sunday అంటే దానిని ఆధారము చేసుకొని సెలవు అంటున్నావు. Sunday అని ఏకాదశియని ఎట్లా నమ్మావు ఒక సిద్ధాంతి వ్రాసిన దానిని నమ్ముతున్నావు. విశ్వసిస్తున్నావు. సాక్షాత్ వేదముల తత్త్వమసి నాయనా నీవే అగ్నిస్వరూపుడవు. ప్రజ్ఞానం బ్రహ్మ. అయమాత్మా బ్రహ్మ. అహం బ్రహ్మాస్మి. అనే ముఖ్య విషయములు ఎందుకు నమ్మటం లేదు. ఇదే మానవుని బలహీనత. సత్యమైన దానిని నమ్మలేక పోతున్నాడు. కనుక మానవుడు ఇన్ని విధములైన కష్టములకు నష్టములకు ఘోరములకు గురౌతున్నాడు. దైవ వాక్కును నమ్మాలి. దైవ వాక్కును మనం నడచుకోవాలి. అప్పుడే సరైన స్థితి కలుగుతుంది. కానీ మానవుడు దీనిని నమ్మలేక పోతున్నాడు.

ఒకానొక సమయంలో షిర్డీలో భక్తుడైన నానా తనకుమార్తె మైనా ప్రసవ వేదనలో బాధపడుతుంది. మూడు నాలుగు దినములైపోయింది. బాగా నీరసించింది. ఆమె ప్రాణము ఉంటుందో లేదో అనే సందేహ స్థితి వచ్చింది. నూరు సంవత్సరముల పూర్వము ఎట్టి వైద్యము, ఎట్టి ఆసుపత్రులు, నర్సులు ఉండేవారు కాదు. నిరంతరము పటము దగ్గర బాబా బాబా బాబా నాకుమార్తెను రక్షించు అని ప్రార్థించాడు. భక్తుడు ఎక్కడ ఏవిధముగా ప్రార్థించినా భగవంతునికి ఒక connection ఉంటున్నది. వైర్‌లెస్ కంటె వేగముగా చేరుతుంది. భక్తునికి భగవంతునికి heart to heart love to love హృదయమునకు హృదయ సంబంధము. తక్షణమే బాబాకు తెలిసింది. అక్కడ బాపూ అనేవాడు ఉండేవాడు రంగ్ బాపూ. అతనిని బాబా బాపూ అని పిలిచేవాడు. 'బాపూరా! విభూతి తీసుకొని జమ్నేర్ గ్రామములో నున్న నానాకు అందించు' అన్నాడు. ఆజ్ఞ అన్నాడు. జేబులో చూచుకున్నాడు. రెండు రూపాయలున్నాయి. జల్గాం వరకు రైలులో పోవచ్చు. జమ్నేరు పోవటానికి తన దగ్గర డబ్బులు లేవు. బాబా నా దగ్గర కాసులు లేవు. నన్ను ఎలా వెళ్లమంటారు' అన్నాడు. 'ఒరే పిచ్చివాడా! నేను చూచుకుంటాను. పొమ్మని ఎప్పుడు చెప్పానో తగిన arrangements నేను చూచుకుంటాను. సందేహమునకు చోటివ్వు. ఇట్లే రామావతారమందు రాముడు హనుమంతుని ఆజ్ఞాపించాడు 'హనుమా నీవు సీతాన్వేషణ చేయాలి. లంకలో ప్రవేశించి సీత ఏవిధంగా ఉంటున్నదో ఆమె స్థితిగతులు కనుక్కొని రమ్మన్నాడు. హనుమంతుడు సందేహించాడు. ఇంత పెద్ద సముద్రము నేను ఏవిధంగా దాటాలి. నన్ను పొమ్మని

చెబుతున్నారు. అని కొంత సంకోచించాడు. ఆజ్ఞ ఇచ్చినవాడే ఈ కార్యము పూర్తి చేయించుకుంటాడు. నాతో ఈ కార్యము సాధించుటకై నాకీ కార్యము ఇచ్చాడు. ఇంకెవరికి ఇవ్వలేదే. ఆజ్ఞాపించిన భగవంతుడు ఈ కార్యములో అన్నీ తానే చూచుకుంటాడని ధైర్యముతో వెళ్లాడు. పరిశుద్ధమైన విశ్వాసము. అచంచలమైన విశ్వాసము. బాపూగీర్ సందేహముతో ప్రశ్నించాడు బాబాను. నాదగ్గర రెండు రూపాయలున్నాయి నేనింత దూరము ఎట్లా పోవాలి. జల్గాం నుండి ముప్పై మైళ్ళు పోవాలి. ఆరోజుల్లో టాంగాలు మాత్రమే ఉండేవి. ముప్పై మైళ్లు టాంగాలో వెళ్లాలి. లేక నడచి పోవాలి. ముప్పై మైళ్లు నడవగలనా అని సందేహిస్తుండగా బాబా ధైర్యము నిచ్చాడు. నా మాట విశ్వసించు నా ఆజ్ఞ శిరసావహించు. నీవు వెళ్ళు అన్నాడు. జవాబు చెప్పకుండా జల్గాంవరకు రైలులో వెళ్ళాడు. రాత్రి 1½ గంటలకు జల్గాం లో దిగాడు. నేను ఎక్కడికి పోయేది ఈ చీకటిలో ఏవిధంగా కాలము గడపాలి? అని అక్కడ కూడా కన్నులు మూసుకొని బాబాను ప్రార్థించాడు. ఒక బిళ్ళ జవాను వచ్చాడు. పాతకాలములో తవసీల్దారు వెంట బిళ్ళ వేసుకొని జవాను ఉండేవాడు. ఆ జవాను ఆజాను బాహువు. ఎవరు బాపూ ట్రైనులో దిగారు షిర్డీనుండి అని కేకలు వేసుకుంటూ వచ్చాడు. 'బాబా పంపితే వచ్చాను. నా పేరు బాపూ' అన్నాడు. 'రండి రండి మీకోసం టాంగా కాచుకొని ఉంటున్నది' అన్నాడు. ఎక్కడనుంచి వచ్చాది' అన్నాడు. 'నానాసాహెబ్ పంపించాడు'. టాంగాలో కూర్చున్నాడు. తాను పోతుంటే టాంగా నడచినట్లు లేదు. అంత స్పీడుగా పోతున్నది. తనలో అనుకుంటున్నాడు ఎంత స్పీడుగా పోతున్నది అని. ఈ విధంగా తలచుకుంటుంటే గ్రామము వచ్చింది. అదుగో అదే నానా ఇల్లు అని చూపించాడు. ఆయన దిగాడు నడచి తిరిగి టాంగా వానితో చెబుదామని వెనుకకు తిరిగాడు. టాంగా లేదు. టాంగా నడిపే వాడు లేడు. సరే ఇంటికి వచ్చి చేరాడు. 'నానాసాహెబ్! ఇదుగో బాబా విభూతి పంపించాడు. ఎప్పుడు పంపాడు. నిన్న సాయంకాలమే పంపాడు రాత్రి 1½ గంటలకు స్టేషను చేరాను. మీకు ఎట్లా తెలిసిందో ఏమిటో మీరు టాంగా పంపటంచేత శీఘ్రముగా ఇల్లు చేరగలిగాను. నానాకు ఆశ్చర్యం వేసింది. 'నా దగ్గర టాంగా లేదే? నేను ఎవరిని పంపలేదే? నీవు వచ్చేది నాకు తెలియదే. ఎందుకు ఈ విధంగా చెబుతున్నావు. ఆ టాంగా ఎక్కడుంది చెప్పమన్నాడు. 'అయ్యా దిగిన వెంటనే టాంగా కనిపించలేదు. అతను చెప్పటం మీరు పంపినట్లు చెప్పాడు' అన్నాడు. మాటలకు సమయము కాదు మొట్టమొదట పేషెంటుకు ఇవ్వాలని లోపలకు వెళ్లి ప్రసాదము ఇచ్చాడు. బాబా పటము దగ్గరకు వెళ్ళి ప్రార్థన చేశాడు. బాబా బాబా బాబా అని అరిచాడు అరుపులో పలనే బిడ్డ అరుపులు వినిపించాయి. కుమారుడు పుట్టాడు.

ఆనందములో తిరిగి బాపూ దగ్గరకు వచ్చి బాపూ ఏమి జరిగిందో చెప్పు బాబా

ఏమి చెప్పారు. ఏ విధంగా వచ్చావు? అని అడిగినప్పటికి రెండు రూపాయలతో నేను వచ్చాను. బాబా అన్ని సదుపాయములు చేశాడు. నమ్మిన వారిని వదలడు. నమ్మకమే ప్రధానమైనది. 'నమ్మకమను రెండు నయనమ్ములే లేని అంధులైరి నేడు అవని యందు'. నమ్మకమనే నయనములు కోల్పోయినాము మనము ఈనాడు. నమ్మి పని చేస్తే దేనిలోనైనా విజయము చేకూర్చుకో వచ్చు. ఈ నమ్మకము చేతనే నేను అంత ఆనందము పొందగలిగాను. మూడవ దినము నానా, బాపు షిరిడి వెళ్ళారు. బాబా! ఏమి నీ యొక్క నాటకము ఏమి నీ సందేశము! ఏమి నీ లీలలు! ఇవి వర్ణనాతీతమైనవి.' ఇదే రీతిగా ద్వాపర యుగములో గోపికలు రామావతారంలో వానరులు భగవంతుని ఈ రీతిగా వర్ణిస్తూ వచ్చారు. నానాకు చక్కని కంఠము. చక్కగా పాటలు పాడేవాడు. అక్కడను వెళ్ళి ప్రార్థన చేశాడు.

నిను కనుగొనగలమా బాబా నిను కనుగొనగలమా।
అణువు కంటె అతి సూక్ష్మరూపుడవు
ఘనము కంటె అతి ఘననీయుడవు
ఎనుబది లక్షల జీవరాసుల అనయంబును ఎడబాయకుందువట
అణువు రేణువు తృణ కాష్ఠము మొదలుగ అఖండ రూపుడవై వెలయుదువట।
ఘనమగు దొంగలలో గజ దొంగవు నీవు. ॥కను॥

బాబా! అన్నీ నీకు తెలుసు. కానీ తెలియని వానివలె నటిస్తావు. నీవు బడా చిత్త చోరుడవు. ఇందులో రహస్యము గుర్తించాలి. ఎవరైనా వచ్చి గజదొంగవురా అంటే మనకు కోపం వస్తుంది. ఏమి దొంగతనం చేశాను ఎందుకు గజదొంగ అంటున్నావు అని వానిపై పోట్లాడుతావు. అదే పదములో పాటగా పాడితే 'బడా చిత్త చోర బృందావన సంచార గోపాల గోపాల హే మురళి గోపాల' అంటే అందరు తాళం వేసి పాడతారు. గానములోనున్న మాధుర్యము ఇంత ఆనందముగా ఉంటుంది. ప్రేమరసమును త్రాగిన ఉన్మత్తుడై పోతాడు. పాటలయందు మాటలయందు ఉన్న మాధుర్యము ఇట్టిది అట్టిదియని ఎవరు వర్ణించలేరు.

ఒక ఉదాహరణము. పిల్లలు చక్కగా తెలుసుకోవాలి. భగవంతుని గానప్రియుడని పిలుస్తాము. భగవంతుని మాటల రీతిగా పిలిస్తే ఒకరీతిగా ఉంటుంది. పద్యము రీతిగా పిలిస్తే ఒకరీతిగా ఉంటుంది. పాటల రీతిగా పిలిస్తే ఒకరీతిగా ఉంటుంది. హే! రామ ఎంత దయామయుడవయ్యా నీవు అంటే మనసు కరగదు. 'శ్రీరామా! నన్ను కాపాడు' అని పద్యములో చెబితే అది కూడా అంత ఇంపుగా ఉండదు.

'రామా! నన్ను కాపాడు'. పాటతో వస్తే హృదయాన్ని లాగేస్తుంది. గానలోలుడు, గానప్రియుడు భగవంతుడు అక్కడ నానా గానము చేస్తున్నాడు. బాబా కూడా ఉన్మత్తుడయ్యాడు. మత్తుతో లీల చూపుతున్నాడు. ఆపాట తాను కూడా కోరస్ పాడుతున్నాడు. ఈ విధముగా గానము పాడే వానిని తన్మయము గావిస్తుంది. దైవాన్ని కూడా తాండవమాడిస్తుంది. కనుక దైవమును ప్రార్థించే సమయములో భజనకు ఇంత విలువ ఇవ్వటానికి కారణమిదియే. భజన హృదయపూర్వకముగా చేయాలి. వాల్మీకి రామ చరిత్రము రాముని జీవిత కాలము లోనే రచించినాడు. కుశలవుల చేత సభలో రామ చరిత్రను పాడించాడు వాల్మీకి. నిరంతరము దయారహితుడై, క్రూరుడై, హీనుడై హింసిస్తున్న వాల్మీకి రాళ్లను కూడా కరగించే గానము చేత దివ్యమైన రామ చరిత్రను ప్రపంచమునకందించాడు.

కఠినమైన రాయిని కూడా కరగించి, పెరిగించి ఫలము నిచ్చేదిగా మారుస్తుంటాది దివ్యమైన నామము. చిన్న ఉదాహరణము. కఠినమైన గుండు ఉంది. ఆ గుండుపైన విత్తనాలు పెడితే ఎండిపోతాయి. లేక పక్షులు ఎత్తుకొని పోతాయి. ఆ కఠినమైన రాయిపై మొక్కలు రావు. క్రమక్రమేణా ఎండను ఎండి వానకు నాని రాయి కరగి కరగి మట్టిగా మారిపోతుంది. మట్టిలో విత్తనము పెట్టినప్పుడు విత్తనము మొక్కగా వస్తుంది. మొక్క వృక్షముగా మారిపోతుంది. వృక్షములోనే ఫలములు వస్తాయి. ఫలములు మానవుడు భుజిస్తాడు. ఫలముల యొక్క ప్రసాదమే మానవరూపము ధరిస్తుంది. కఠినమైన రాయి కరగి మానవునిగా రూపొందింప చేసింది ఏది ఆ రాయి. ఆదే విధముగా కఠినమైన రత్నాకరుని హృదయము మారిపోయింది. అదే తపస్సుగా రూపొందించి. అదే వాల్మీకముగానే పుట్టగా రూపొందింది. ఆ వాల్మీకము పెరిగి వర్షములో తిరిగి కరగి పోయినప్పటికి అందులో నుంచి ఆవిర్భవించాడు రత్నాకరుడు. వాల్మీకమునుండి పుట్టిన వాడు కనుక ఇతనికి వాల్మీకి అని పేరు వచ్చింది. పూర్వము రత్నాకరుడు. కఠిన హృదయుడు పాము పుట్టను వాల్మీకమని పేరు. ఇది కరగిపోయి ఇతను బయటపడ్డాడు. కనుకనే ఇతని పేరు వాల్మీకి. విద్యార్థులు కఠినమైన భావములు క్రూరమైన సంకల్పములు హృదయములో చేరకుండా చూచుకోవాలి. సద్భావములు, సచ్చింతనలు, సదాలోచనలు మనం పెంచుకోవాలి. కఠినమైన హృదయాలు మృదుమధురంగా మారతాయి (?). ఆ హృదయమే భగవంతుని నివాసంగా మారుతుంది. హృదయమనే పెద్ద పీఠము ఎవరిది? ఎవరిదో కాదు భగవంతునిదే. ఆ భగవంతుని పీఠముపైన మరొకరు కూర్చొనుటకు వీలుకాదు. నీ మనసులో ఎవరినైనా కూర్చోపెట్టుకో. ఎంత మందినైనా చోటు ఉంటుంది. కానీ హృదయము ఒకటే single sofa గాని double sofa, not musical chair. ఒకరిని ఒక పర్యాయము ఇంకొకరిని ఒక పర్యాయము ఈవిధంగా

మార్చుకో కూడదు. ఒకక్క దైవమునకు మాత్రమే చోటు ఇవ్వాలి. అదే ఈనాడు మనం చేయవలసినది-

ఎన్నో మనము జగత్తులో చూస్తున్నాము. ఎన్నో అనుభవిస్తున్నాము. ఎంతమంది అనుభూతులో మనకు వినిపిస్తున్నాయి. కాని మంచి చెడ్డలు మన ప్రవర్తన నుండే వస్తున్నాయి గానీ పరులనుండి వచ్చేవి కాదు. మొట్ట మొదట మన సంకల్పములను పవిత్రమైన సంకల్పములుగా రూపొందించుకోవాలి. మనలో ఏదైనా సంకల్పము వస్తే is it good or bad టైము తీసుకో ఇది దీని మంచిది కాదనుకుంటే తక్షణమే వదలిపెట్టు. కానీ ఈనాటి మానవునకు అంత ఓపిక లేదు. ఏదైనా సంకల్పము వస్తే తక్షణమే పని చేయటానికి ప్రయత్నిస్తాడు. రాముని అస్త్రము తగిలి రావణుడు క్రింద కూలాడు. కొన్ని నిముషము లోపల ప్రాణం వదలే ముందు అనేకమంది మహర్షులు వచ్చారు. ఇంత గొప్ప మహానాయుడు గొప్పతపశ్శక్తి శస్త్రాలు కలిగిన వాడు ఇతని చివ్వలక్ష్యమేమిటో తెలుసుకోవాలని అందరు చేరారు. రావణా! నీ జీవితములో సంకల్పించింది ఏమిటి సాధించింది ఏమిటి? అని ప్రశ్నించారు. రామ బాణము తగిలింది కనుక పాప పరిహారమైంది. ఉన్నత భావములు ఆవిర్భవించాయి. చేతులు ఎత్తలేక ఎత్తి నమస్కారము చేశాడు. ఓ మహానాయులారా! నేను ఏమి చెప్పుదును. నా సంకల్పము లెన్నో ఉన్నాయి. కానీ అవి కాలేక పోయాయి ఒకటి మాత్రం గుర్తించాలి. జీవితములో వంచి చేయాలని మంచి సంకల్పమే వస్తే ఆలస్యం చేయకూడదు. తక్షణమే పనిలో చేరాలి. మంచి పని వాయిదా వేయకూడదు. మంచి పనులకు ఏమాత్రము టైము తీసుకో వద్దు. సంకల్పము, పని రెండు ఒక్కసారి జరగాలి. చెడ్డ భావములే వస్తే వాటి జోలికి పోవద్దు. కావలసినంత టైము తీసుకో. నేను సంకల్పించుకున్నాను. లంక చుట్టూ ఉన్న సముద్రములోని నీరు తీయగా మార్చాలని సంకల్పించుకొన్నాను. తరువాత తరువాత యని వాయిదా వేసాను. కష్టకాలపటికి ఆ మంచి పని నేను చేయలేక పోయాను. నరకములో బాధ పడే వారిని స్వర్గమునకు పంపించాలని వారిని సుఖరూపులుగా తయారు చేయాలని సంకల్పించుకున్నాను. కానీ తరువాత తరువాత అని వాయిదా వేసుకుంటూ వచ్చాను. మంచి కార్యము వాయిదా వేశాను. నేను మరణిస్తున్నాను. ఈ మంచి కార్యములనేను చేయలేక పోతున్నాను. మీకైనా సత్సంకల్పములు వచ్చిన తక్షణమే క్రియారూపములో పెట్టండి. కాలము వ్యర్థము చేయకండి- చెడ్డ భావములు, చెడ్డ తలంపులకు అవకాశము ఇవ్వకండి- అదియు ఈనాటి యువకులు చేయవలసిన గొప్పఘన కార్యము. ఈనాటి యువకులు భావి భారతోద్ధారకులు. మీరు సద్గుణములను అభివృద్ధి పరచుకొని ఆదర్శ పౌరులనే పేరు తెచ్చుకోవాలి. ఆదర్శ పౌరుడుగా ఉన్నప్పుడు ఎంతైనా ఆదర్శమును అనుభవించవచ్చు. ఎంతమందినైనా మార్చవచ్చు కనుక మనము

25069609

సద్గుణములు పోషించుకోవాలి.

దీనినే వ్యక్తిగత శీలమన్నారు. వ్యక్తిగత శీలము కలిగినప్పుడే లీడరుగా తయారు కావచ్చు. వ్యక్తిగత గుణములు మనం పోషించుకోవాలి. వ్యక్తిగత శీలము, సామాజిక శీలము జాతీయ తత్వము మనం అభివృద్ధి పరచుకోవాలి. జాతీయ భావమే పోయింది. నేను నా కుటుంబము అంతవరకే ప్రయాణము చేస్తున్నారు.

ఇది నా మాతృదేశము
ఇది నా ప్రియ మాతృభాష
ఇది నా మతమంచు ఎదగొట్టి నుడువ నేరని
బ్రతికిన పీనుగు ఒక్కండు వసుధ గలడా.

దేశాభిమానము లేక నీవు బ్రతికిన పీనుగుగా తయారౌతావు. దేశాభిమానము పెంచుకోవాలి. దేహాభిమానము ఎంత ప్రధానమో దేశాభిమానము అంత ప్రధానము. దేశము దేహము యొక్క ప్రతిబింబమే. దేశము, దేహము రెండు బింబ ప్రతిబింబములే.

ఈనాటి విద్యార్థులు తమ పవిత్ర శీలము చేత గుణముల అభివృద్ధి చేత సంకల్పములను చక్కగా మార్చుకోవాలి. చెడ్డ సంకల్పములకు అవకాశము ఇవ్వకూడదు. కొంచెము చోటిస్తే అది పెంచుకుంటుంది. ఏమాత్రము చెడ్డ సంకల్పములు ప్రవేశ పెట్టకూడదు. అవి వచ్చినా మనము వెనుకకు నెట్టాలి. ఎట్లా? మన హృదయ కవాటము మూసి వేయాలి. మనము ఒక ఇల్లు కట్టాము. ఇంటికి కిటికీలు ద్వారాలు పెట్టాము. ద్వారములు ఎందుకోసం? మనం లోపలకు బయటకు పోవటము రావటము కోసం పెట్టాము. మన బంధువులు, మిత్రులు లోపలకు రావటానికి పోవటానికి పెట్టాము. తలుపులు పెట్టుకున్నామని కుక్కలను, పందులను, గాడిదలను వదులుతామా. మనకు పది ద్వారములుంటున్నాయి. ద్వారము లోపల బయట చెత్త చేర్చుకోకూడదు. చెడ్డవాటిని బయటకు తరమాలి. దుర్గుణములు దూరమునుంచే దూరము చేయాలి. లోపల ప్రవేశించేంత వరకు మనం కాచుకోకూడదు. రత్నాకరుడు వాల్మీకిగా మారిపోయాడు. ఇటువంటి దుర్మార్గుడే ఇట్టి సాత్వికుడుగా మారినప్పుడు మానవుడై పుట్టి విద్యావంతుడై పోయి, విజ్ఞానవంతుడై సుగుణములంటూ ఉంటుండే ఈ మానవుడు మాధవత్వము పొందలేక పోతున్నాడంటే ఎంత అవమానము చెప్పండి. విజ్ఞాన ప్రజ్ఞానములతో కూడిన దివ్యత్వముగా రూపొందాలి. ఆ దివ్య భావము చేత

25069610

మానవత్వము చక్కగా తీర్చిదిద్దుకొని దైవత్వంగా రూపొందాలి.

శివునికి ముందుగా నంది ఉన్నది- నంది అంటే పశువు. పశువు ఎక్కడ చూస్తున్నది ఎట్లా చూస్తున్నది- భగవంతునే చూస్తున్నది. ప్రకృతిని చూడటం లేదు. తన దృష్టిని భగవంతునిపైనే concentration చేస్తూ వస్తుంది. కనుక నందిని మనం పూజిస్తున్నాము. ఈ పూజ్యత ఎట్లా కల్గింది. తన దృష్టిని దైవము వైపే మరల్చింది. కనుక పశువైనప్పటికి పూజార్హత గలిగింది. మన దృష్టి మంచి దృష్టి కావాలి. పవిత్ర దృష్టి కావాలి. అదే సుదర్శనము. మంచి దృష్టి. అలాంటి దృష్టి రావటానికి దైవమును చింతిస్తూ దైవమును ఆరాధిస్తూ మనుష్య భావము మార్చుకొని దైవ భావములో మనం చేరాలి.